క్లుప్తంగా

నెట్టికంటుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

గుంతకల్లు రూరల్: పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తన కుటుంబ సభ్యులతోకలిసి సోమవారం సాయంత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి తీర్థ ప్రసాదాలను ఆయనకు అందజేశారు.

వేతనాలు పెంచాలి

పెద్దవడుగూరు: మండలంలోని గంజిగుంటపల్లి వద్ద ఉన మెయిల్ సోలార్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తుల కొండయ్య, పెద్దపప్పూరు ఆదినారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పవర్ ప్లాంటు వద్ద కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జీఎం ప్రకాష్‌కు అందజేశారు.

మహిళ మృతి కేసులో న్యాయం చేయాలి



రోడ్డుపై ధర్నా చేస్తున్న దృశ్యం

పుట్లూరు: మూడు నెలల క్రితం మృతిచెందిన చంద్రకళ కేసులో న్యాయం చేయలేదంటూ ఆమె కుటుంబ సభ్యులు సోమవారం రోడ్డుపై ధర్నా చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడవకల్లు ఎస్సీ కాలనీకి చెందిన చంద్రకళ మూడు నెలల క్రితం మృతి చెందింది. అప్పట్లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చంద్రకళ గుండెజబ్బు కారణంగా మృతి చెందినట్లు దర్యాప్తులో వెల్లడించారని బాధితులు ఆరోపిస్తున్నారు. మృతి చెందిన చంద్రకళపై కాలనీకి చెందిన కొందరు వారి బంధువులతో కలిసి దాడి చేయడం వల్లే మృతి చెందినట్లు వారు చెబుతున్నారు. ఈ కేసులో న్యాయం చేయాలంటూ పలుమార్లు వినతులు ఇచ్చినా పోలీసులు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్రమణ్యం సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదును స్వీకరించారు.


పప్పుశనగ పంపిణీలో నిర్లక్ష్యం

తాడిపత్రి రూరల్/యల్లనూరు: పప్పుశనగ పంపిణీలో రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన యల్లనూరు వ్యవసాయాధికారిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం తాడిపత్రిలో ఏడీఏ చెంగలరాయుడుకు రైతు సంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి వినతిపత్రం అందచేశారు. యల్లనూరు మండలంలోని వెన్నపూసపల్లిలో రైతులకు 40 కిలోల చొప్పున పప్పుశనగను పంపిణీ చేయకుండా కేవలం 20 కిలోలు పంపిణీ చేస్తున్నారన్నారు. అలాగే ఎకరాకు 40 కిలోల పప్పుశనగ పంపిణీ చేయాలని జంగంపల్లి రైతులు యల్లనూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

జీఆర్‌పీ సీఐకి సన్మానం

గుంతకల్లు: ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న గుంతకల్లు జీఆర్‌పీ సీఐ నగేష్‌బాబును మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల డీజీపీ ద్వారాక తిరుమలరావు చేతుల మీదుగా సీఐ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం జీఆర్‌పీ కార్యాలయంలో సీఐని ఆ సమితి రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాసు, నాయకులు నాగప్ప, జయరాం, రాజేష్, భారతి, బాబురావు తదితరులు సత్కరించారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలపుతున్న దృశ్యం

యాడికి: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ నాయకులు మండలంలోని చేనేత కార్మికులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటరాముడు యాదవ్ మాట్లాడుతూ ముడి సరుకుల ధర పెంచడం, చీరలపై జీఎస్టీ వేయటం వల్ల చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత ప్రభుత్వం ఏటా నేతన్న నేస్తం పథకం కింద ప్రతి కార్మికుడికీ రూ.24వేలు అందించగా ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం రూ.36వేలు అందిస్తామని చెప్పి నేతన్నలకు అన్యాయం చేసిందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాములు, ఓబుళరెడ్డి, వడ్డె రాముడు, గరిడి శివన్న, బండారు రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు కరెంట్ కష్టాలు

- గాలి వీచినా, వర్షం వచ్చినా కరెంట్ కట్
- నీరు సక్రమంగా అందక ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతులు





ఎద్దులపల్లి విద్యుత్ సబ్-స్టేషన్

మండలం:	పామిడి
సబ్ స్టేషన్లు:	3
(పామిడి, ఎద్దులపల్లి, పాళ్యం)	
వ్యవసాయ కనెక్షన్లు:	15,000
గృహ కనెక్షన్లు :	13,700

పామిడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. పామిడి మండలంలోని ఎద్దులపల్లి సబ్-స్టేషన్ ఫీడర్ కింద ఎద్దులపల్లి, రామగిరి, రామగిరి ఎగువ తండా, రామగిరి దిగువ తండా, దిబ్బసానిపల్లి, కట్టకిందపల్లి గ్రామాలు వస్తాయి. ఈ ఫీడర్ కింద దాదాపు 4 వేల మంది రైతులు 18 వేల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. అందులో 3 వేల ఎకరాల్లో వరి, 2 వేల ఎకరాల్లో వేరుశనగ, వెయ్యి ఎకరాల్లో చీనీ, మిగతా 2 వేల ఎకరాల్లో కూరగాయలు, కంది తదిదర పంటలు సాగులో ఉన్నాయి. ఇదిఇలా ఉంటే చిన్న గాలి వీచినా, వర్షం వచ్చినా కరెంట్ సరఫరా నిలిచిపోతోంది. దీంతో మోటార్ల కింద సాగుచేసిన పంటలకు కరెంటు అంతరాయం తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఈక్రమంలో ఆశించిన స్థాయిలో పంటలు దిగుబడికి నోచుకోవడం లేదు. కరెంట్ అంతరాయంతో గృహాలకు సైతం విద్యుత్ సరఫరా కట్ అవుతుండడంతో చీకట్లోనే గడపాల్సి వస్తోంది. చీకట్లో విషపురుగుల బెడద లేకపోలేదు. ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్‌మెన్‌లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్ల కొరతతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు నోచుకోవాలంటే కొన్ని గంటలు, దినాలు వేచి చూడాల్సిన దుస్థితి నెలకొందంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు రైతులకు విద్యుత్ స్తంభాలతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సిబ్బంది కొరతతో జాప్యమవుతోంది.

పంట దిగుబడి తగ్గుతోంది



నాకు 11 ఎకరాల పొలం ఉంది. అందులో నాలుగు ఎకరాల్లో చీనీ తోట, మూడు ఎకరాల చొప్పున ఆరు ఎకరాల్లో వేరుశనగ, వాటర్ మిలన్ (కళింగర కాయ), ఒక ఎకరాలో వరి పంట సాగు చేశా. రూ. 6 లక్షలు పెట్టుబడితో ఈ పంటలు సాగుచేస్తున్నా. చిన్న వర్షం వచ్చినా, గాలి వీచిన కరెంట్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో విద్యుత్ మొటార్ బోర్లు ఆడక ఆశించిన స్థాయిలో పంట దిగుబడి లేకుండా పోతోంది.

- జీ వీరాంజనేయులు, రైతు , ఎద్దులపల్లి

అధికారులు స్పందించాలి



15 ఎకరాల్లో చీనీ, 6 ఎకరాల్లో మామిడి, 4 ఎకరాల్లో వరి పంటసాగుచేస్తున్నా. మొత్తం రూ. 16 లక్షలు పెట్టుబడి పెట్టాను. ఇటీవల వీస్తున్న గాలులు, వర్షానికి తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఉన్న ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, కాంట్రాక్ట్ ఉద్యోగి వల్ల విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు జాప్యం అవుతోంది. అధికారులు సిబ్బంది కొరత తీర్చి కరెంట్ కష్టాల నుంచి గట్టెక్కించి, పంటలను కాపాడాలి.

-నీలం సాయినాథ్‌రెడ్డి, రైతు, ఎద్దులపల్లి

అంతరాయాన్ని అధిగమిస్తాం



గాలి వర్షానికి విద్యుత్‌వైర్లు ట్రిప్ అవుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోతోంది. కరెంట్ సరఫరా సమస్యలను పరిష్కరించడానికి ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని ఏర్పాటు చేశాం. సిబ్బంది కొరతతో విద్యుత్ సరఫరాలో కొంచెం జాప్యం అయి ఉండవచ్చు. విద్యుత్ సిబ్బంది కొరత, సమస్య తీవ్రతపై ఉన్నతాధికారులకు నివేదించాం. కరెంటు సమస్యను నేరుగా తనదృష్టికి తీసుకొస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో అధిగమిస్తాం.

-మధుసూదన్‌రావు, ఏఈ, పామిడి

ఆరె కటికల సంక్షేమానికి కృషి



డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

గుత్తి: ఆరెకటిక కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గుత్తిలోని ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీ మాత ఆలయంలో డైనింగ్ హాల్, అతిథి గదుల నిర్మాణానికి ఎంపీ భూమి పూజ చేశారు. అలాగే సునామ జకినీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భూమి పూజ అనంతరం ఆయన ఆరె కటికల సమావేశంలో మాట్లాడారు. ఆరె కటికల సంక్షేమానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ఆరె కటికలు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, సీనియర్ నాయకుడు గుమ్మనూరు నారాయణ, పట్టణ, మండల కన్వీనర్లు బర్దివలి, చౌదరి , న్యాయవాది సోమశేఖర్, సునామ జకినీ మాత ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణ రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడె సాయినాథ్, మహిళా అధ్యక్షురాలు సరస్వతి బాయి, ధర్మకర్త సురేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

శింగనమల వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మించండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న శింగనమల యువకులు

శింగనమల: అసెంబ్లీ కేంద్రమైన శింగనమలకు వెళ్లేందుకు దారి లేకుండా నూతనంగా 544–డీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని, భవిష్యత్‌లో రోడ్డు దాటాలంటే ప్రమాదాలకు గురికావాల్సి ఉంటుందని, శింగనమల వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మించాలని యువకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శింగనమలకు చెందిన రాంచరణ్ తదితరులు మాట్లాడుతూ అనంతపురం నుంచి తాడిపత్రి వెళ్లే 544–డీ నాలుగు వరసల లైన్ రోడ్డులో గాలిమరలు వెళ్లే దారి ఎదురుగా చెరువుకు అనుకుని రోడ్డు ఉండేదన్నారు. నూతనంగా కొండను చీల్చి రోడ్డు నిర్మిస్తున్నారన్నారు. అక్కడ శింగనమలలోకి వచ్చేందుకు బ్రిడ్జి నిర్మించకుండా రోడ్డు వేస్తున్నారన్నారు. దీంతో శింగనమలలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం ఏర్పాటుకు సహకరించాలని ఆయన కోరారు.

లోకమాతా పాహిమాం..

సాక్షి నెట్‌వర్క్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



తాడిపత్రిలో కాళికాదేవిగా విజయ చాముండేశ్వరీదేవి



గుంతకల్లులో గాయత్రీదేవిగా వాసవీ మాత



బీకేఎస్‌లో మహా చండీ అలంకరణలో అంకాలమ్మ

అక్రమంగా బిల్డింగ్ లైసెన్స్ ఇస్తే చర్యలు



మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: మున్సిపాలిటీ పరిధిలో కొందరు ప్రైవేట్ లైసెన్స్ దారులు అడ్డదిడ్డంగా బిల్డింగ్‌లకు లైసెన్స్‌లు ఇస్తున్నారని, ఇకపై చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రైవేట్ బిల్డింగ్ లైసెన్స్ హోల్డర్లు, స్టాంప్ రైటర్లు తదితరులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అక్రమంగా లైసెన్స్‌లను ఇవ్వడం వల్ల ఇష్టానుసారం భవనాలను నిర్మించుకుంటూ పట్టణాన్ని అక్రమ కట్టడాలమయంగా మారుస్తున్నారు. ఇకపై నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే, లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. ప్రజలు కూడా ఆలోచించుకోవాలని.. మునిసిపాలిటీకి సంబంధం లేకుండా బిల్డింగులు కట్టుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శివరామక్రిష్ణ, సబ్ రిజిస్ట్రార్ శివ నారాయణ, టీపీఎస్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని మహిళ నిరసన

గుత్తి రూరల్: హాండ్స్ స్వచ్ఛంద సంస్థ పీడీ నారాయణస్వామి గత నాలుగేళ్లుగా వేతనాలు ఇవ్వకుండా తనను అక్రమంగా విధుల నుంచి తొలగించాడని సోమవారం తులసీబాయి అనే మహిళ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపింది. బాధిత మహిళ వివరాల మేరకు... పట్టణ శివారులోని కొత్తపేట వద్ద ఉన్న హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థలో గుంతకల్లుకు చెందిన తులసీబాయి అనే మహిళ అగ్రికల్చర్ ప్రాజెక్టు మేనేజర్‌గా 15 ఏళ్లుగా పని చేస్తోంది. 2020 నుంచి పీడీ నారాయణ స్వామి ఆమెకు వేతనాలు చెల్లించకుండా నిలిపివేశాడు. 'ఎమ్మెల్యే, ఎంపీ, పెద్ద పెద్ద రాజకీయ నాయకులు తెలుసు. ఒక్క రూపాయి కూడా ఇవ్వను. ఏం చేసుకుంటావో చేసుకో' అని ఆయన భయపెడుతున్నాడని ఆమె వాపోయింది. నాలుగేళ్ల వేతనం, రవాణా చార్జీలు, ఫర్నీచర్ కొనుగోలు మొత్తం తనకు రూ.6.53 లక్షలు ఆయన చెల్లించాలని, న్యాయం చేయాలని గుత్తి-తాడిపత్రి మార్గంలోని 67వ నంబర్ జాతీయ రహదారిపై తులసీబాయి బైఠాయించి ఆందోళన చేసింది. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందిని పంపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆమెను అక్కడి నుంచి పంపించారు.

'మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా దళితులనే నియమించాలి'

గుంతకల్లు: డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినే నియమించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల ఎంపికలో అవకతవకలపై ఆర్‌డీఓ శ్రీనివాస్‌కు దళత సంఘం నాయకులు వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ దళిత సంఘం అధ్యక్షుడు తగరం రామాంజనేయులు, ఎస్సీ, ఎస్టీ ఫోరం అధ్యక్షుడు ఎం.మహేంద్ర, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.భీమలింగ, అడ్వకేట్ కొరి చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ గుంతకల్లు డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బీసీ వర్గానికి చెందిన జేవీవీ నాయకుడు హరిప్రసాద్ యాదవ్‌ను నియమించడం ఎంత వరకు సమంజసం ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, ఎసన్న, రవీంద్ర, సంపత్, బాలాంజినేయులు తఛీటతరులు పాల్గొన్నారు.

అధికారుల అనుమతితోనే పనులు

యాడికి: అధికారుల అనుమతితోనే పాత బస్టాండు ఆవరణలో పనులు చేపట్టామని, టీడీపీ నేతలు పనులను అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని వేములపాడు రహదారిలోని మూడు ఎకరాల్లో ఉన్న పాత బస్టాండు శిథిలావస్థకు చేరుకుందన్నారు. బస్టాండు ఆవరణలోని ఖాళీ స్థలాన్ని యాడికి మండల కేంద్రానికి చెందిన రాచమల్లు కొత్తమిద్దె సూర్యచంద్రారెడ్డి పేరిట నెలకు రూ.63వేల ప్రకారం జూలై 3, 2023 నుంచి జూలై 2, 2038 వరకూ 15 సంవత్సరాల పాటు లీజు అగ్రిమెంటును కడప ఏపీఎస్ ఆర్టీసీ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ ద్వారా అనుమతులు పొందారన్నారు. ఆ స్థలంలో శిథిలావస్థలో బస్ స్టేషన్‌ను తొలగించుకుంటామని 11.12.2023న కడప ఏపీఎస్ ఆర్టీసీ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్‌కు లీజుదారుడు వినతి పత్రం ఇచ్చారన్నారు. ప్రతి నెలా బాడుగ చెల్లిస్తున్న సూర్యచంద్రారెడ్డి , వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి సోమవారం జేసీబీతో పాత బస్టాండు గోడలను తొలగిస్తుండగా టీడీపీ నాయకుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు పనులను అడ్డుకున్నారు. అలాగే తాడిపత్రి ఆర్టీసీ డీఎం శంకరయ్య యాడికి పోలీస్టేషన్‌కు వచ్చి ఆర్టీసీ ఉన్నతాధికారుల అనుమతులు వచ్చే వరకూ పనులు చేపట్టవద్దని సీఐ ఈరన్న సమక్షంలో లీజు అనుమతి పొందిన వారికి సూచించారు. త్వరలోనే ఏపీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారుల అనుమతులు పొందిన తర్వాత పనులు చేపడతామని బొంబాయి రమేష్ నాయుడు పేర్కొన్నారు. యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకట నాయుడు, నాగరాజు, రామ్మోహన్, కోటి వెంకట రాముడు, నాయకులు పండుశ్రీరాములు, సుదర్శన్ రెడ్డి, గుర్రాల కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా నయీమ్ అహమ్మద్



గుంతకల్లుటౌన్: గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌గా నయీమ్ అహమ్మద్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. అలాగే వైఎస్సార్ జిల్లా కేంద్రంలో టిడ్కో ఈఈగా పనిచేస్తున్న లీలా కృష్ణప్రసాద్ మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఆదోని నుంచి బదిలీపై వచ్చిన శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు.

డీఎల్‌డీఓగా విజయలక్ష్మి



గుంతకల్లు రూరల్: డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వంలో గుంతకల్లు డివిజన్ ఏర్పాటు అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల గుంతకల్లు డివిజన్‌కు డీఎల్‌డీఓను ప్రభుత్వం నియమించింది. డ్వామాలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న విజయలక్ష్మిని గుంతకల్లు డీఎల్‌డీఓగా నియమిమించారు.

పుట్లూరు సీఐగా సత్యబాబు



పుట్లూరు: మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం పుట్లూరు సీఐగా సత్యబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ సుబ్రమణ్యం అనంతపురం వీఆర్‌కు బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లాలో వీఆర్‌లో ఉన్న సత్యబాబును పుట్లూరుకు బదిలీ చేయడంతో, ఆయన బాధ్యతలు తీసుకున్నారు.

ఏఓగా వాసుదేవరెడ్డి



యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా వాసుదేవరెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. యల్లనూరులో గత కొన్ని నెలలుగా ఏఓ పోస్టు ఖాళీగా ఉంది. బాధ్యతుల స్వీకరించిన ఆయనకు తోటి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పంచాయతీ కార్యదర్శులుగా సలీంబాషా(యల్లనూరు), ప్రసాదు (జంగంపల్లి), సరోజ (తిరుమలాపురం), హర్షవర్ధన్‌రెడ్డి (గొడ్డుమర్రి) బాధ్యతలు తీసుకున్నారు.

భద్రత నియమాలను పాటించాలి

గుంతకల్లు: రైల్వే కార్యకలాపాల నిర్వహణలో భద్రత నియామాలను ఖచ్చితంగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన గుంతకల్లు డీఆర్‌ఎం విజయ్‌కుమార్‌తోపాటు జోనల్‌లోని ఇతర డివిజన్ల డీఆర్‌ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రామాణికమైన, సురక్షితమైన విధానాలను అనుసరించడం ద్వారా రైలు ప్రమాదాల నివారించవచ్చన్నారు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు భద్రత వ్యవస్థను మెరుగుపరుచాలన్నారు. ప్రయాణికులను నాణ్యమైన ఆహరం, తాగునీరు అందించాలన్నారు. దసరా సెలవులు దృష్ట్యా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.10 వేలు



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు చెక్ అందజేస్తున్న దృశ్యం

శింగనమల: మండలంలోని సోదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరద బాధితుల కోసం ప్రజలు, ఉపాధ్యాయుల నుంచి సేకరించిన విరాళం రూ.10 వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను సోమవారం ఉపాధ్యాయుడు వివేకానంద తదితరులు కలెక్టర్ వినోద్‌కుమార్ అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి

పామిడి: సమస్యలు పరిష్కరించి, పామిడి పట్టణాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేయాలని పామిడి అభివృద్ధి సంఘం కోరింది. సోమవారం ఈఓగా బాధ్యతలు చేపట్టిన గోపాల్‌ను సంఘ సభ్యులు కలిసి పలు సమస్యలను విన్నవించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, డ్రైనేజీలు, కలుషిత నీరు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈసందర్భంగా ఈఓను వారు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పామిడి అభివృద్ధి సంఘం సభ్యులు వీ బుజ్జిబాబు, ఎంసీ షఫి, పరదేశి అనిల్‌కుమార్‌రాజా, డీవీ జీవన్‌కుమార్, పెద్ద పుల్లయ్య, కొట్టూరు శ్రీనివాసులు, బాబాసలాం, లంగాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఈ పంట నమోదు పరిశీలన

శింగనమల: మండలంలో ఈ–పంట నమోదుపై సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయానికి చెందిన మూడు టీంలు పరిశీలించాయి. కార్యక్రమంలో ఏఓ అన్వేష్ కుమార్, వీఆర్వోలు , ఎంపీఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గాలీవానకు నేలకొరిగిన మునగ చెట్లు

శింగనమల: గాలీవాన మునగ చెట్లు నేలకొరిగాయని మండలంలోని నాగులగుడ్డంకు చెందిన కౌలు రైతు మక్బుల్ బాషా సోమవారం తహసీల్దార్‌కు బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం సాయంత్రం గాలీవాన రావడంతో ఆరు ఎకరాల్లో సాగు చేసిన మునగ చెట్లు పడి పోయాయన్నారు. దాదాపు రూ.3 లక్షలు పంట నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

వృత్తి విద్య కోర్సుతో ఉద్యోగ భద్రత

గార్లదిన్నె: విద్యార్థులు వృత్తి విద్య కోర్సు నేర్చుకుంటే నిరుద్యోగ సమస్య తొలగి ఉద్యోగ భద్రత కలుగుతుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో మోడల్ స్కూల్లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎంబ్రైడరీ, టైలరింగ్, ఫ్యాషన్,ఐటీపై శిక్షణ ఇస్తున్నారన్నారు. కార్యక్రమాన్ని జీసీడీఓ సైయద్ రవూఫ్ పరిశీలించారు. ఒకేషనల్ కో ఆర్డినేటర్ మధు, మనోహర్, యోగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కె.ఊబిచెర్లకు చెందిన చంద్రశేఖర్ గుత్తికి వచ్చి తిరిగి గ్రామానికి బైక్‌లో వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన జయరాముడు, రాజ్‌కుమార్ ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. గాయపడిన వారిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని గోసువారిపల్లి సమీపంలో ఉన్న కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.20170 నగదును స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐ కాటమయ్య తెలిపారు. తాడిపత్రి పట్టణంలోని జయనగర్ కాలనీకి చెందిన బాలిరెడ్డి, గద్దరగుట్టపల్లి రామచంద్రారెడ్డి, ఆలూరు గోసు రాజగోపాల్‌రెడ్డి, సజ్జలదిన్నె తలారి రంగయ్య, రైల్వే కొండాపురం మండలం సిరిగేపల్లి బండరాజలను అరెస్టు చేశామన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానంలో సోమవారం పేకాట స్థావరంపై సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆజాద్, హెడ్ కానిస్టేబుళ్లు జాఫర్, శివ శంకర్, పీసీలు భాస్కర్ నాయుడు, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఓ వ్యక్తి మట్కా రాస్తుండగా అరెస్టు చేసి, అతడి నుంచి రూ. 27,600 నగదును స్వాధీనం చేసుకున్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రి అర్బన్: నందలపాడులో మట్కా నిర్వహిస్తున్న మిద్దె ఓబయ్యను అరెస్టు చేసి, రూ.25వేలు స్వాధీనం చేసుకున్నా అర్బన్ సీఐ సాయిప్రసాద్ సోమవారం తెలిపారు.